సాక్షి కర్నూలు

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



అడవిలో ఆరని మంటలు

రుద్రవరం: నల్లమల అడవిలో వారం రోజుల క్రితం మొదలైన కార్చిచ్చు ఆరిపోవడం లేదు. మంటలను అదుపు చేయాల్సిన అటవీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.



మిర్చి మిలమిల!

మిర్చి రైతుకు ఈ ఏడాది బాగా కలిసి వచ్చింది. ఎకరాకు సగటున 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. క్వింటా ధర రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పలుకుతోంది.

8లో▸



'సాఫ్ట్‌వేర్' శిక్షణ

డోన్ టౌన్: జీపీ శేషారెడ్డి నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో 3 నెలల పాటు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో శిక్షణ ఇస్తున్నారు. వివరాలకు 7981238237ను సంప్రదించవచ్చు.

న్యూస్‌రీల్

మార్చి నెలాఖరు వరకు 'ఈ-కేవైసీ'కి అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వ సాయం పొందడానికి ఈ-కేవైసీ చేయించుకోవడానికి మార్చి నెలాఖరు వరకు అవకాశం ఉంది. జిల్లాలో 2,56,239 మంది రైతులకు గాను 2,11,570 మంది ఈ-కేవైసీ చేయించుకున్నారు. ఆస్పరి 4,253, గోనెగండ్ల 3,241, కల్లూరు 2,627, ఆలూరు 2,216, సి.బెళగల్ 2,152, కోసిగి 2,534, తుగ్గలి 3,334, పత్తికొండ 2,112, కోడుమూరు మండలంలో 2,172 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది.

ప్రాధాన్యత భవనాలకు రూ.7.68 కోట్లు విడుదల

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలకు రూ.7.68 కోట్లు విడుదలైనట్లు పంచాయతీ రాజ్ పర్యవేక్షక ఇంజినీరు కే సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదోని మండలానికి రూ.2.23 కోట్లు, కోడుమూరుకు రూ.2.53 కోట్లు, తుగ్గలికి రూ.2.39 కోట్లు, ఎమ్మిగనూరుకు రూ.2.30 కోట్లు, చిప్పగిరి మండలానికి రూ.16.49 లక్షలు విడుదలయ్యాయని ఎస్ఈ చెప్పారు. మొత్తం రూ.30.73 కోట్ల బిల్లులను అప్‌లోడ్ చేయగా, 25 శాతం విడుదలయ్యాయని, మిగిలిన 75 శాతం విడతల వారీగా విడుదల చేసే అవకాశాలు ఉన్నాయన్నారు.

ప్రశాంతంగా 'దేవదాయశాఖ ఈఓ' పరీక్ష

కర్నూలు(సెంట్రల్): దేవదాయ ధర్మదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడు-3 మెయిన్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కర్నూలు శివారులో కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన పరీక్షకు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో కలిపి మొత్తం 366 మందికిగాను 344 మంది హాజరయ్యారు. రెండు సెషన్లలో కలిపి మొత్తం 22 మంది మాత్రమే గైర్హాజరయ్యారు. మొత్తంగా 93.98 శాతం అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు జిల్లా కో ఆర్డినేటర్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు.

సీహెచ్‌సీల ఏర్పాటుకు షెడ్యూల్

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం కింద ఇంతవరకు 113 రైతు భరోసా కేంద్రాల్లో కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీలు) ఏర్పాటు కాలేదు. వీటిలో సీహెచ్‌సీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చింది. ఈ నెల 20వ తేదీలోపు 50 శాతం మిషనరీ కాస్ట్, సబ్సిడీ అమౌంటు చెల్లించడం, సీహెచ్‌సీ శాంక్షన్, పర్చేజ్ ఆర్డర్ ఇవ్వడం చేయాల్సి ఉంది. ఈ నెల 28లోపు మిషనరీ డెలివరీ, జాయింట్ తనిఖీలు పూర్తి చేస్తారు. మార్చి 5న రైతుమిత్ర గ్రూపుల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం సబ్సిడీని విడుదల చేయనుంది.

రెండో రోజూ నామినేషన్లు నిల్

కర్నూలు(సెంట్రల్): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండో రోజు శుక్రవారం కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి ఎస్.రామసుందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం, ఆదివారాలు సెలవు కావడంతో సోమవారం నుంచి గురువారం వరకు మాత్రమే నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

25లోపు ఫీజు చెల్లించాలి

కర్నూలు సిటీ: డీఎడ్ పరీక్షలకు ఈ నెల 25వ తేదీలోపు ఫీజు చెల్లించాలని డీఈఓ రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎడ్ మొదటి సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలతో పాటు గతంలో 2015-17 నుంచి 2018-20 విద్యా సంవత్సరాల్లో ఫెయిల్ అయిన వారు కూడా ఫీజు చెల్లించవచ్చన్నారు. నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.150, మూడు సబ్జెక్టులకు రూ.140, రెండు సబ్జెక్టులకు రూ.120, ఒక సబ్జెక్టు రూ.100 ప్రకారం చెల్లించాలని డీఈఓ పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుంతో వచ్చే నెల 2వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు.

భారీ వాహనాల దారి మళ్లింపు

శ్రీశైలంప్రాజెక్ట్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కర్నూలు - గుంటూరు రహదారిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తుగా భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహాశివరాత్రి రోజు శనివారం రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు దోర్నాల నుంచి శ్రీశైలం వైపు ఎటువంటి వాహనాలను అనుమతించడం లేదని ఆయన తెలిపారు. అలాగే ఆదివారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు కర్నూలు నంద్యాల చెక్‌పోస్ట్ వద్ద భారీ వాహనాలను నిలుపుదల చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



బ్రహ్మమురారి సురార్చిత లింగం
నిర్మలభాసిత శోభిత లింగం
జన్మజదుఃఖవినాశక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

'బ్రహ్మ, విష్ణు దేవతలచే పూజింపబడే లింగం.. నిర్మలమైన మాటలతో శోభించబడిన లింగం.. జన్మ వల్ల పుట్టే దుఃఖాలను నాశనం చేసే లింగం.. నీకు ఇవే నా ప్రణామములు సదాశివ లింగం' అంటూ ఆ పరమేశ్వరుడి ఎదుట భక్త కోటి ప్రణమిల్లుతోంది. శివరాత్రి గడియలు సమీపిస్తున్న వేళ పాతాళగంగలో భక్తి కెరటం ఎగిసిపడగా.. శ్రీశైల పురవీధులు భక్తజనసంద్రంగా మారాయి. శివరాత్రి జాగరణ చేసి మల్లన్నను దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తుండగా బ్రహ్మోత్సవ వైభవాన్ని చూసేందుకు రెండు కనులు చాలడం లేదు.



గజ వాహనంపై విహరిస్తున్న ఆది దంపతులను దర్శించుకుంటున్న భక్తజనం



ఉత్సవంలో కళాకారుడి అగ్ని విన్యాసం

జయ జయ మహాదేవ!



- నేడు మహా శివరాత్రి
- మల్లన్న చెంత జాగరణకు తరలివచ్చిన భక్తకోటి
- శ్రీగిరిలో మిన్నంటిన బ్రహ్మోత్సవ సందడి
- గజ వాహనంపై ఊరేగిన శ్రీశైలేశుడు





గజ వాహన సేవ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు, ఉత్సవంలో మహిళల కోలాటం

శ్రీశైలంటెంపుల్: నల్లమల కొండల్లో పంచాక్షరి ప్రణవ నాదం మారుమోగుతుండగా.. శ్రీశైల దారుల్లో శంభో శంకర.. హరోం హర.. ఓం.నమఃశివాయ.. నినాదాలు హోరెత్తుతుండగా.. జయ జయ శ్రీశైల లింగ చక్రవర్తి.. నమో నమః అంటూ భక్త కోటి కీర్తిస్తుండగా.. శ్రీగిరి క్షేత్రం పరవశించిపోతుంది. ఇల కైలాసమైన శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మికభరితంగా సాగుతున్నాయి. ఏడవ రోజు శుక్రవారం భ్రమరాంబా సమేతుడైన మల్లన్న గజవాహనంపై విహరించాడు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో ఉత్సవమూర్తులను గజవాహనంపై ఆశీనులను చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక అర్చన, హారతి పూజలు నిర్వహించారు. అనంతరం గజవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ చేయించారు. కృష్ణదేవరాయ గోపురం మీదుగా క్షేత్రప్రధాన వీధుల్లోకి తీసుకువచ్చి గ్రామోత్సవానికి సిద్ధం చేశారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డి వారి చక్రపాణి రెడ్డి, ఈవో ఎస్.లవన్న దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. గంగాధర మండపం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం నందిమండపం, బయలువీరభద్రస్వామి ఆలయం వరకు సాగింది. జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు, భక్తుల కోలాహలం నడుమ గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. గజవాహనంపై దర్శనమిచ్చిన స్వామిఅమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమంలో శ్రీశైలం బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి ఆజాద్, ధర్మకర్తల మండలి సభ్యులు ఒ.మధుసూదన్‌రెడ్డి, మఠం విరూపాక్షయ్యస్వామి, డా.కనకదుర్గ, ఎం. విజయలక్ష్మి, అంబాల లక్ష్మి సావిత్రమ్మ, హనుమంత్‌నాయక్, ధర్మరాజు, మాజీ ఈవో వంగాల శివరామిరెడ్డి, ఏఈవో హరిదాసు, ఆయా విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణమ్మకు హారతులు.. మల్లన్నకు మొక్కులు


ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు లక్షలాదిగా శ్రీశైలం చేరుకున్నారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి కృష్ణమ్మకు త్యేక పూజాహారతులు ఇచ్చారు. అనంతరం మల్లన్న దర్శనానికి ఆలయ క్యూలైన్లలో బారులుదీరారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌రెడ్డివారిచక్రపాణిరెడ్డి, సభ్యులు పర్యవేక్షణలో వారి సలహాలు, సూచనల మేరకు శ్రీశైల దేవస్థానం ఈఓ ఎస్. లవన్న ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తుల సౌకర్యార్థం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

శ్రీశైలంలో నేడు..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఎనిమిదవ రోజు శనివారం రాత్రి 10 గంటలకు పాగాలంకరణ సేవ, లింగోద్భవ సమయాన మల్లికార్జునుడికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపడుతారు. 12 గంటలకు స్వామిఅమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ముందుగా రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో నందివాహనసేవ, ఎదుర్కోలు నిర్వహిస్తారు.

చూసిన కనులదే భాగ్యం

- నేడు పరమశివునికి పాగాలంకరణ
- హస్తినాపురం వాసి పృథ్వీ వెంకటేశ్వర్లుకు అదృష్టం
- అర్ధరాత్రి మహారుద్రాభిషేకం.. స్వామిఅమ్మవార్లకు కల్యాణం



శ్రీశైలాలయం



పాగాలంకరణకు సిద్ధమైన పాగా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో మల్లన్నకు పాగాలంకరణ ఒక విశిష్ట సేవ. మహాశివరాత్రి పర్వదినాన లింగోద్భవకాలంలో జరిగే ఈ సేవ వెనుక ఎన్నో ఆధ్యాత్మిక అంశాలు నిక్షిప్తమై ఉన్నాయి. పాగాలంకరుడైన మల్లన్నను చూసేందుకు భక్తుల రెండు కళ్లు చాలవు. భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశాన్ని పంచభూతాలుగా పరిగణిస్తారు. వీటి సమ్మేళనమే ఈ భౌతిక ప్రపంచం. ఈ పంచభూతాలకు ప్రతీకలుగా మల్లన్న ఆలయంలోని ఐదు కలశాలు. స్వామివారి గర్భాలయ విమాన గోపురానికి మధ్యలో ఒకటి, నాలుగు మూలలో నాలుగు కలశాలు ఉన్నాయి. గర్భాలయ ముఖమండపంపై తొమ్మిది నందులు ఉన్నాయి. 4 కలశాలు, 9నందులు మొత్తం 14. 14 లోకాలను ఏలే శ్రీలింగ చక్రవర్తికి ఈ సంఖ్యతో కూడిన పాగాలంకరణ జరగడం విశేషం. తద్వారా 14లోకాలకు మల్లన్న అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని, లోకకల్యాణం జరగాలన్న ఆకాంక్షలను స్వామివారికి భక్తులు తెలియజేయడమే ఈ పాగాలంకరణ వెనుక ఉన్న విశేషం.

వంశ పారంపర్యంగా

ప్రకాశం జిల్లా హస్తినాపురం గ్రామానికి చెందిన చేనేత పృథ్వీ సుబ్బారావు కుటుంబం వంశపారంపర్యంగా మల్లన్నకు తలపాగాను తయారు చేస్తోంది. ఆయన కుమారుడు పృథ్వీ వెంకటసుబ్బారావు సహాయంగా నిలుస్తున్నాడు. బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి 10 గంటల నుంచి 12గంటల లోపు పాగాలంకరణ జరుగుతుంది. స్వామివారికి దిక్కులే వస్త్రా లు. అందుకే పాగాలంకరణ సేవ చేసేవారు దిగంబరంగానే ఉండి కార్యాన్ని పూర్తి చేస్తారు. ఆ సమయంలో ఆలయ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

అభిషేకంతో ఆహ్వానం

పాగాలంకరణ సమయంలో మల్లన్నకు లింగోద్భవకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుగుతుంది. అనంతరం కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏకాదశ రుద్రాభిషేకం ఉకదశ రుద్రులకు ప్రతీక. ఒక్కో అభిషేకంలో ఒక్కో రుద్రుడు ఆవిష్కృతమవుతాడు. ఈ రుద్రాభిషేకం ఆవుపాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార అనే పంచామృతాలు, పండ్లరసాలతో, కొబ్బరి నీరు, విభూది నీరు, కుంకుమ నీరు, జవ్వాది, కస్తూరి పునుగు వంటి సుగంధ ద్రవ్యాలతో నిర్వహిస్తారు. తదుపరి నిర్మలమైన నీటితో మరోసారి అభిషేకించి స్వామివారి మూలమూర్తిని అలంకరించి మంగళహారతులు ఇచ్చి వివిధ నైవేద్యాలను సమర్పిస్తారు. చివరిగా స్వామివారికి నీరాజనం చూపడంతో లింగోద్భవకాల రుద్రాభిషేకం ముగుస్తుంది. తదుపరి రాత్రి 12 గంటలకు భ్రమరాంబా సమేత మల్లికార్జునుడికి బ్రహ్మోత్సవ కల్యాణం నిర్వహిస్తారు.



దీక్ష విరమిస్తున్న శివ స్వాములు



టెంకాయలను హోమ గుండంలో వేస్తున్న దృశ్యం



చలువ పందిళ్ల కింద సేదతీరిన భక్తులు



బాల శివ.. భక్తి భళా..



కృష్ణమ్మకు వాయినం సమర్పిస్తూ..



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీశైల పురవీధి



సేవలందిస్తున్న మహిళా క్షురకులు

రావణవాహనంపై మహానందీశ్వరుడి దంపతులు



మహానందీశుడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి రావణవాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఉపప్రధానార్చకులు వనిపెంట జనార్దనశర్మల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లు సూర్యప్రభ వాహనంపై కొలువై ఆలయంలో విహరించారు. రాత్రి రావణవాహనంపై కొలువై ఊరేగారు. నంద్యాల డీఎస్పీ సి.మహేశ్వరరెడ్డి, ఏఈఓ ఎర్రమల మధు, సీఐ రవీంద్ర, ఎస్ఐ నాగార్జునరెడ్డి, కళ్యాణోత్సవ దాత టి.ప్రసాద్, తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

'పర్యావరణ' పరీక్షకు 1,086 మంది గైర్హాజరు

కర్నూలు సిటీ: పర్యావరణ విద్య పరీక్షకు 1,086 మంది ఇంటర్‌మీడియట్ విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో శుక్రవారం 306 కేంద్రాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 33,687 మంది విద్యార్థులకు గాను 32,601మంది హాజరైనట్లు ఆర్ఐఓ గురవయ్యశెట్టి తెలిపారు.

నేడు, రేపు పనిచేయనున్న విద్యుత్ బిల్లు కేంద్రాలు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం శని, ఆదివారాల్లోనూ విద్యుత్ బిల్లుల కేంద్రాలు పని చేస్తాయని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి, ఆదివారం సెలవు అయినా వినియోగదారుల సౌకర్యార్థం తెరిచే ఉంటాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వీడియో వీక్షణ బృందాల ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్): శాసనమండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పర్యవేక్షించేందుకు మూడు వీడియో వీక్షణ బృందాలను ఏర్పాటు చేశారు. కర్నూలు డివిజన్‌కు సంబంధించి ఆర్‌డీఓ కార్యాలయంలో పనిచేసే జి.రామకృష్ణయ్య, ఆర్.ప్రతాప్ సింగ్, ఆదోని డివిజన్‌కు సంబంధించి ఎం.శ్రీనివాస్, ఎస్ అశోక్‌కుమార్, పత్తికొండ డివిజన్‌కు సంబంధించి ఎస్.లక్ష్మీనారాయణ, కె.శ్రీకాంతల్ ఆధ్వర్యంలో వీడియో వీక్షణ బృందాలు పనిచేయనున్నాయి. ఆయా బృందాలు తమ కార్యాలయాల్లోనే ఉండి ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే వార్తలను వీక్షించాల్సి ఉంటుంది. అందులో ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన ఏమైనా వీడియోల ప్రసారం అయితే విషయాన్ని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నోడల్ ఆఫీసర్, కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్‌తేజకు తెలపాల్సి ఉంటుంది.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

ఆలూరు: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఈఓ రంగారెడ్డి అన్నారు. దేవనకొండ మండలం తెర్నేకల్ జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. వెనుకబడి విద్యార్థులపై దృష్టి సారించి, వారు పాస్ అయ్యే విధంగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఎంఈఓ రంగస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో డైట్ కళాశాల అధ్యాపకులు షంషుద్దీన్, గణిత ఉపాధ్యాయుడు అరుణాచలంరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు, రేపు మదనపల్లెలో ఇస్తెమా



చలువ పందిళ్లు వేసిన దృశ్యం

మదనపల్లె: అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె పట్టణం ఇస్తెమాకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. శని, ఆదివారాలు (రెండు రోజుల పాటు) జరగనున్న ఈ ధార్మిక సదస్సుకు రాయలసీమలోని ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన ముస్లింలు సుమారుగా రెండు లక్షల మందికి పైగానే హాజరవుతారని అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా ఇప్పటికే కదిరి రోడ్డులోని టిప్పుసుల్తాన్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం ఇస్తెమా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు టిప్పుసుల్తాన్ మైదానానికి రాయచోటి, మదనపల్లె ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, నవాజ్‌బాషా వచ్చారు. నిర్వాహకులతో చర్చించి, ప్రభుత్వం తరపున అవసరమైన సహాయసహకారాలు అందిస్తామన్నారు.

సెలవులో ఆదోని విద్యుత్ ఈఈ

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆదోని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సుధాకర్ కుమార్ సెలవుల్లో వెళ్లారు. వ్యక్తిగత కారణాలతో నెల రోజుల పాటు ఆయన సెలవుపై వెళ్లడంతో కర్నూలు కన్‌స్ట్రక్షన్ విభాగం ఈఈగా పనిచేస్తున్న రాజేష్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ కర్నూలు కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పరిహారంపై రైతులతో సమావేశం

తుగ్గలి: రైల్వే డబుల్ లైన్‌కు భూములు కోల్పోయిన రైతులతో శుక్రవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ మోహన్‌దాస్ సమావేశమయ్యారు. తుగ్గలి రెవెన్యూ పరిధిలో 5.30 ఎకరాల భూమిని రైల్వే డబుల్ లైన్ కోసం తీసుకున్నారు. దీనికి ఎంత పరిహారం అందించాలనే విషయంపై ఆర్డీఓ రైతుల అభిప్రాయాలను తీసుకున్నారు. ఆ ప్రాంతంలో ఎకరం భూమి రూ.10 లక్షలకు పైగా ధర పలుకుతోందని రైతులు ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. రైతులను అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయమైన పరిహారం అందించేలా చూస్తామని ఆర్డీఓ చెప్పారు.

కర్ణాటక మద్యం తరలిస్తే చర్యలు

ఆలూరు: కర్ణాటక మద్యం తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆలూరు సెబ్ సీఐ ఎర్ర వెంకట్ హెచ్చరించారు. కర్ణాటక మద్యం తరలింపుదారుల సమాచారాన్ని సెల్ 63027 38236 నంబర్‌కు కాల్ లేదా మెసేజ్ ద్వారా అందిస్తే వెంటనే దాడులు నిర్వహిస్తామని చెప్పారు.

మిర్చి మిలమిల!

- జిల్లాలో రికార్డు స్థాయిలో సాగు
- ఎకరాకు నగటున 25 క్వింటాళ్ల దిగుబడి
- క్వింటా ధర రూ.20 వేలపై మాటే!
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

కలిసొచ్చిన సాగు



కల్లంలో ఆరబెట్టిన మిర్చిలో నిల్చున్న ఈ రైతు పేరు గిడ్డయ్య. గోనెగండ్ల మండలం హెచ్.కైరవాడి గ్రామ వాసి. ఈయన 20 ఏళ్లుగా ఎండిమిర్చి సాగు చేస్తున్నాడు. గతేడాది ఎకరాకు 30 క్వింటాళ్లకుపైగా దిగుబడి వచ్చింది. దానిని కొంత రూ.21వేల ప్రకారం, మరికొంత రూ.30వేల ప్రకారం విక్రయించాడు. ఈ ఏడాది మూడు ఎకరాల్లో సాగు చేశాడు. ఇప్పటికే రెండు సార్లు కోత కోశాడు. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టగా దిగుబడి 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు వస్తోంది. ప్రస్తుతం గుంటూరు మార్కెట్‌లో మిర్చి క్వింటా ధర రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ధర పలుకుతోంది. మిర్చి సాగు బాగా కలసి రావడంతో గిడ్డయ్య సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

కర్నూలు(అగ్రికల్చర్): మిర్చి పంట రైతులకు లాభాలను తెచ్చి పెడుతోంది. జిల్లాలో సాధారణ సాగు 50,395 ఎకరాలు ఉండగా.. గతంలో ఎన్నడూ లేని విధంగా 1,26,215 ఎకరాల్లో సాగైంది. గోనెగండ్ల, ఆలూరు, హాలహర్వి, మంత్రాలయం, కోసిగి, హొళగుంద, దేవనకొండ, పెద్దకడుబూరు, ఆస్పరి, సి.బెళగల్, కల్లూరు, చిప్పగిరి తదితర మండలాల్లో సాగు ఎక్కువగా ఉంది.

ఇప్పటి వరకు రెండు కోతలు పూర్తి అయ్యాయి. మరో రెండు కోతలు వచ్చే అవకాశం ఉంది. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోని వందలాది గ్రామాల్లో నేలపై ఎర్ర తివాచీ పరిచినట్లు మిరప దిగుబడులు మిలమిల మెరుస్తున్నాయి.

రూ.75 వేల నుంచి 1.25 లక్షల వరకు పెట్టుబడి

మిర్చి సాగులోఎకరాకు రూ.75 వేల నుంచి 1.25 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నారు. సగటున 25 క్వింటాళ్ల ప్రకారం దిగుబడులు వస్తున్నాయి. జిల్లాలో పండించిన మిర్చి 90 శాతం గుంటూరు మార్కెట్‌కు వెళ్తోంది. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో కూడా క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. అయితే ఇక్కడికి ఎక్కువ తెలంగాణ రైతులు తెస్తున్నారు. కర్నూలు మార్కెట్‌కు నాణ్యత పరంగా మొదటి రకాలు రాకపోయినా ఈ ఏడాది క్వింటాకు గరిష్టంగా రూ.39 వేల వరకు ధర లభించింది. జిల్లాలో ఎక్కువగా బ్యాడిగ, సింజెంట, ఆర్మూర్, తేజ, సూపర్ డీలక్స్, దేవనూరు డీలక్స్ వంటి రకాలు సాగు చేస్తున్నారు. ఈ రకాలతో పండించిన మిర్చితో నాణ్యత ఎక్కువగా ఉంటుంది. దీంతో సగటున క్వింటాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ధర లభిస్తోంది. గతేడాది మిర్చి పంటను నల్ల తామర కొంత వరకు దెబ్బతీసింది. ఈ ఏడాది దీని ప్రభావం అంతగా లేదు.

'డ్రిప్' సదుపాయం

జిల్లాలో ఈ ఏడాది 10వేల ఎకరాలకు సూక్ష్మ సేద్యం సదుపాయం కల్పించారు. అత్యధికంగా మిర్చికే డ్రిప్ సదుపాయం కల్పించడం విశేషం. దీంతో దిగుబడులు నాణ్యతతో వచ్చాయి. నీటి సదుపాయంతో సాగు చేసిన పొలాల్లో రికార్డు స్థాయిలో 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో కొందరు రైతులు మిర్చిని ఏసీ గోదాముల్లో నిల్వ చేస్తున్నారు.



గోనెగండ్ల మండలంలో ఆరబెట్టిన మిర్చి

కష్టానికి తగిన ఫలితం



ఈ రైతు పేరు శ్రీనివాసరెడ్డి. గోనెగండ్ల మండలం కలుమూల గ్రామానికి చెందిన ఈయన ఈ ఏడాది 1.50 ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. ఇప్పటి వరకు రెండు కోతలు కోశాడు. మొదటి కోతలో 8 క్వింటాళ్లు రాగా క్వింటా రూ.21వేల ప్రకారం విక్రయించాడు. రెండో కోతలో 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటా రూ. 20వేల ప్రకారం అమ్మాడు. ఇంకా రెండు కోతలకు 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మార్కెట్‌లో ధరలు ఉండడంతో కష్టానికి తగిన ఫలితం వచ్చిందని ఈ రైతు సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

ఈ సారి చీడపీడల సమస్యలు లేవు



జిల్లాలో ఈ ఏడాది మిర్చి సాగు భారీగా పెరిగింది. అధిక దిగుబడులు, తెగుళ్లను తట్టుకునే రకాలు అనేకం మార్కెట్‌లోకి వచ్చాయి. గతేడాది మిర్చి పంటను నల్ల తామర దెబ్బతీసింది. ఈ సారి నల్ల తామర నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. గతేడాదితో పోలిస్తే ఈ సారి చీడపీడల సమస్యలు అంతగా లేవు. దీంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. మిర్చికి గిట్టుబాటు ధరలు లభిస్తుండటం రైతులకు ఊరటనిస్తోంది. – రామాంజనేయులు, జిల్లా ఉద్యానాధికారి, కర్నూలు

19న ఆర్చరీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్ ఆర్చరీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విలువిద్య సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్, ప్రవేశ రుసుం రూ.100 చెల్లించి నేరుగా హాజరుకావచ్చని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు విజయవాడలోని శాతవాహన డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ విలువిద్య పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 93938 55460 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

26న వాల్మీకుల రౌండ్ టేబుల్ సమావేశం

కర్నూలు(అర్బన్): ఈ నెల 26వ తేదీన స్థానిక మౌర్యా ఇన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు వాల్మీకుల రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ (వాల్మీకి) బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జే శ్రీనివాసులునాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతు వాల్మీకి / బోయలను ఎస్‌టీ జాబితాలో చేర్చాలని, వాల్మీకుల కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు బడ్జెట్ కేటాయించాలని, అమరావతిలో వాల్మీకి స్మృతి వనం నిర్మాణానికి 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలన్నారు. వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు శాశ్వత జీఓను విడుదల చేయాలన్నారు. ఈ సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సాధించుకునేందుకు వీలుగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని వాల్మీకి సంఘాలకు చెందిన నాయకులు, ఉద్యోగులు, యువకులు, ప్రజలు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

కాల్వబుగ్గ బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు

ఓర్వకల్లు: భక్తుల భద్రతే లక్ష్యంగా కాల్వబుగ్గ బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వరస్వామికి శుక్రవారం ఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కర్నూలు డీఎస్పీ మహేష్‌తో కలిసి ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సచివాలయ మహిళా పోలీసులతో సహా మొత్తం 100 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్షేత్రంలో సీసీ కెమెరాలతో నిఘా ఉంచామన్నారు. రూరల్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, ఎస్ఐ మల్లిఖార్జున, ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ఆలయ ఈఓ డీఆర్‌కెవి ప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, నాయకులు జీకే వెంగన్న, గోపారమణారెడ్డి, రామమోహన్‌రెడ్డి, రామేశ్వరరెడ్డి, చంద్రపెద్దస్వామి పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

జగన్నాథగట్టుపై ఏర్పాట్ల పరిశీలన

కర్నూలు : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా జగన్నాథగట్టుపై ఉన్న రూపాల సంగమేశ్వర శివాలయం వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ సిద్ధార్థ కౌశల్ పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ప్రశాంత వాతావరణం కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు.

పశుపోషణపై దృష్టి పెట్టాలి

ఆలూరు: రైతులు వ్యవసాయంతోపాటు పశుపోషణపై దృష్టి పెట్టాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.రామచంద్రయ్య సూచించారు. దేవనకొండ మండలం కుంకనూరు గ్రామంలో శుక్రవారం వెలమకూరు గ్రామ పశు వైద్యాధికారి ఎస్‌జీ.వెంకటేష్ సమక్షంలో పశుపోషణ, పశుగణాభివృద్ధి, గర్భధారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జేడీఏ మాట్లాడుతూ.. రైతులు పశువులు, మేకలు, కోళ్లను పెంచుకోవడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. పశు సంవర్ధ శాఖ పాడి అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. తక్కువ ధరకు లింగనిర్ధారిత గర్భధారణ సూదులు అందుబాటులోకి వచ్చాయన్నారు. రైతులు ముర్రజాతి, దేశవాళీ, ఒంగోలు, గిర్ జాతి దూడలను పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా పశుగణాభివృద్ధి ఉప సంచాలకులు రాజశేఖర్, కర్నూలు డివిజన్ పశువైద్యాధికారులు దుర్గాప్రసన్న బాబు, వెంకటేశ్వర్లు, మల్లన్న, అనిలా, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 45 లేగదూడలు, లింగ నిర్ధారణ వీర్యకణాల సూదులు, పశువులు, గేదెలు పెంపకంపై ప్రదర్శన ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న కె.రామచంద్రయ్య

పత్తిలో 'రటోనింగ్' రైతుకు ఎంతో మేలు

కర్నూలు(అగ్రికల్చర్): పత్తిలో రటోనింగ్ విధానాన్ని అమలు చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురు అధికారులు అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడ్తూరు గ్రామానికి వెళ్లి పత్తిలో రటోనింగ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం శుక్రవారం వారు కర్నూలుకు తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా సాగు విధానాలను కలెక్టర్‌కు టి.విజయకుమార్ తెలిపారు. పత్తిని వేర్లతో సహా తీసివేయకుండా భూమికి అడుగు ఎత్తువరకు కట్ చేసి(రటోనింగ్) నీళ్లు కడితే చిగుళ్లు వచ్చి పంట పెరుగుతుందన్నారు. పంట పెరిగేలోపు అంతర పంటలుగా అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు, పెసర, అలసంద వంటి పంటలు సాగు చేయవచ్చని సూచించారు. విత్తనం ఖర్చు లేకుండానే రటోనింగ్ ద్వారా మళ్లీ పత్తి పంట తీయవచ్చని, అంతర పంటల సాగు ద్వారా గణనీయమైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లా పశ్చిమ ప్రాంతంలో పత్తి ఎక్కువగా సాగు అవుతోందని, ఈ విధానాన్ని అక్కడ అమలు చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. అనంతపురం వెళ్లి రటోనింగ్ విధానాన్ని పరిశీలించి వచ్చిన అధికారుల్లో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య, జిల్లా నీటియామాన్య సంస్థ పీడీ అమర్‌నాథరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు, జిల్లా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



అనంతపురం జిల్లాలో రటోనింగ్ పత్తిని పరిశీలిస్తున్న టి. విజయ్‌కుమార్, జిల్లా అధికారులు

కర్నూలులో ఇద్దరు బాలికల మిస్సింగ్

- సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితుడి గుర్తింపు
- మర్రిపాడు మండలంలో పట్టుకున్న పోలీసులు
- బాలికలను కర్నూలులో లాడ్జిలో ఉంచిన వైనం
- కేసును ఛేదించిన మర్రిపాడు, కర్నూలు పోలీసులు

మర్రిపాడు: కర్నూలుకు చెందిన ఇద్దరు బాలికల మిస్సింగ్ కేసును నెల్లూరు జిల్లా మర్రిపాడు, కర్నూలు పోలీసులు ఛేదించారు. పోలీసుల కథనం మేరకు.. కర్నూలులోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు బాలికలు కనిపించడంలేదని కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో అక్కడి పోలీసులు సాంకేతికత ఆధారంగా అనుమానితుల ఫోన్ నంబర్లను ట్రేస్ చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ లైవ్ లొకేషన్ నెల్లూరు వైపు చూపించాయి. దీంతో పోలీసులు నెల్లూరు ఎస్పీ విజయారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి తగిన ఆదేశాలు తీసుకోవాలని మర్రిపాడు పోలీసులను ఆదేశించారు. ఈ క్రమంలో డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు, మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డిని కర్నూలు పోలీస్ బృందం కలిసింది. ఇరువురూ కలిసి వాహనాల తనిఖీ ప్రారంభించారు. ఓ లారీని తనిఖీ చేశారు. అయితే సెల్‌ఫోన్ సిగ్నల్ అక్కడే చూపించింది. దీంతో క్లీనర్ బోనాల సురేష్ ఫోన్ తీసుకుని పరిశీలించగా అతనే నిందితుడని తేలింది. అయితే బాలికలు లారీలో లేరు. వారిని కర్నూలులోని ఓ లాడ్జిలో ఉంచినట్లు చెప్పాడు. ఇద్దరు బాలికలను క్లీనర్, మరో వ్యక్తి ప్రేమ పేరుతో మోసం చేసినట్లు గుర్తించారు. వారిని క్లీనర్ లాడ్జిలో ఉంచాడని పోలీసులు తెలుసుకున్నారు. క్లీనర్ కృష్ణపట్నం పోర్టులో లోడింగ్ నిమిత్తం రాగా.. అది పూర్తయ్యాక బాలికలతో వేరే రాష్ట్రానికి వెళ్లిపోవాలనుకుని ప్రణాళిక వేసుకున్నారు. ఇంతలో కేసును ఛేదించారు. అక్కడి పోలీసులకు విషయం చెప్పగా బాలికలను రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు, మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డిని నెల్లూరు జిల్లా ఎస్పీ సీహెచ్ విజయారావు అభినందించారు.

క్రైం కార్నర్


పాత నేరస్తుల అరెస్ట్

కర్నూలు: దోపిడీ, దొమ్మి, సారా విక్రయాలు, మట్కా నిర్వాహణ తదితర కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరు పాత నేరస్తులను కర్నూలు మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. తుగ్గలి మండలం కొత్తపల్లి గుడిసెల గ్రామానికి చెందిన ముంగా అశోక్ కుమార్ కర్నూలులోని నంద్యాల చెక్ పోస్టు సమీపంలో ఉన్న అరుంధతి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతనిపై తుగ్గలి, గుంతకల్ పోలీస్ స్టేషన్లలో దోపిడీ, దొమ్మి కేసులున్నాయి. బుధవారపేటకు చెందిన మధుబాబు మట్కా బీటర్‌గా ఉండేవాడు. అదనపు ఆదాయం కోసం సారా విక్రయాలు జరిపేవాడు. ఈ మేరకు అతనిపై పలు కేసులు కూడా ఉన్నాయి. పోలీసులు వీరిద్దరినీ అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 5 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

కృష్ణగిరి: పొలం పనులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వస్తున్న సమయంలో బైక్ ఢీకొని వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామానికి చెందిన కురువ రాములమ్మ(58) మృతి చెందారు. గురువారం కృష్ణగిరి మోడల్ స్కూల్ సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. గాయాలైన ఆమెను 108లో కర్నూలుకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతురాలి భర్త కురువ అయ్యన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

మక్కాకు వెళ్లి తిరిగిరాని లోకాలకు



పింజరి అల్లిపీర (ఫైల్)

పత్తికొండ రూరల్: వారం రోజుల క్రితం మక్కాకు వెళ్లిన పత్తికొండకు చెందిన రిటైర్డు అధ్యాపకుడు పింజరి అల్లిపీర (61) గుండెపోటుతో అక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈయన పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు, మృతులు జ్ఞానేశ్వర్ ,సైఫుల్లా (ఫైల్)

ఆదోని టౌన్: కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలోని సైదాపూర్ చేరువలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదోనికి చెందిన ఇద్దరు మృతి చెందారు. మృతుల బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణం హనుమాన్‌నగర్ వీధిలో నివాసముంటున్న జ్ఞానేశ్వర్ (38) కంచి శారీస్ హౌస్‌లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. గుల్బర్గాలో కంచి పట్టు చీరలు విక్రయించేందుకు కారులో ఆదోని పట్టణం కార్వన్‌పేటకు చెందిన డ్రైవర్ సైఫుల్లా(40)తో కలిసి వెళ్లాడు. సైదాపూర్ సమీపంలో కారు, లారీ ఢీకొనడంతో ఇద్దరూ మృత్యువాత పడ్డారు. జ్ఞానేశ్వర్‌కు భార్య, ముగ్గురు పిల్లలు, సైఫుల్లాకు భార్య, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్దలు మృతి చెందడంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

చేపలవేటకు వెళ్లి మృత్యువాత



రామచంద్రుడు (ఫైల్)

ప్యాపిలి: చెరువులో చేపలవేటకు వెళ్లిన ఓ వ్యక్తి శుక్రవారం ప్రమాదవశాత్తూ మృత్యువాత పడ్డాడు. వెంగళాంపల్లి గ్రామానికి చెందిన రామచంద్రుడు (52) గ్రామ శివారులోని చిన్నచెరువులో చేపలు పట్టేందుకు స్థానికులతో కలసి వెళ్లాడు. చేపలు పడుతుండగా రామచంద్రుడి కాలు వలలో చిక్కుకోవడంతో ప్రమాదవశాత్తూ చెరువులోకి పడిపోయాడు. గమనించిన తోటి జాలర్లు వెంటనే ఒడ్డుకు చేర్చారు. అయితే అప్పటికే రామచంద్రుడు మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న ప్యాపిలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

ఆదోని రూరల్ : అతిగా మద్యం తాగి బైచిగేరి గ్రామానికి చెందిన బోయ విజయ్(23) శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంటికొచ్చి ఉలుకూపలుకూ లేకుండా పడిపోవడంతో 108 అంబులెన్స్‌లో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య చాముండేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. విజయ్‌కు వివాహమై 8 నెలలు అయ్యింది.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం

పగిడ్యాల: మునగ కాయలు కోసేందుకు చెట్టు ఎక్కిన ఓ యువకుడు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం లక్ష్మాపురం అంచె వద్ద చోటుచేసుకుంది. కొత్త పాలమర్రి గ్రామానికి చెందిన కుమ్మరి రాజు బతుకుదెరువు నిమిత్తం కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. ఇతని కుమారుడైన శివ(22) పెద్దనాన్న అయిన రమణ వద్ద ఉంటున్నాడు. సాయంత్రం మునగ చెట్టు ఎక్కి అకస్మాత్తుగా విద్యుత్ షాక్ గురై ప్రమాదం బారినపడ్డారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న శివను కుటుంబీకులు ఆటోలో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

పశువుల పాక దగ్ధం

మహానంది: తమ్మడపల్లెలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ముల్లా మదార్‌వలికి చెందిన పశువుల పాక దగ్ధమైంది. ఈ ఘటనలో రెండు ఎద్దులు తీవ్రంగా గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ అప్పటికే తీవ్ర నష్టం వాటిల్లింది. బాధితుడిని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వరరెడ్డి పరామర్శించారు.